క్లుప్తంగా

ముమ్మరంగా సాగుతున్న సర్వే



తోట్లవల్లూరు: మండలంలో కులగణన ముమ్మరంగా సాగుతోంది. మండల వ్యాప్తంగా 13 గ్రామ సచివాలయాల పరిధిలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఆయా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి కులగణన వివరాలు సేకరిస్తున్నారు. ఆదివారం సైతం పలు గ్రామాలలో కులగణన కొనసాగింది. ఎంపీడీఓ తుంగల స్వర్ణలత, పంచాయతీ కార్యదర్శులు సర్వేను పర్యవేక్షించారు.

పిరమిడ్ కేంద్రంలో హెల్త్ క్లినిక్



గుడివాడ టౌన్: స్థానిక తట్టివర్రు రోడ్‌లోని పిరమిడ్ ధ్యాన కేంద్రంలో హెల్త్ క్లినిక్‌ను ఆదివారం ప్రారంభించారు. శ్రీ రమణ మహర్షి ధ్యాన క్షేత్రంలో ఈ హెల్త్ క్లినిక్‌ను ఏర్పాటు చేశారు. ఈ హెల్త్ క్లినిక్‌లో కాపర్ పిరమిడ్ బెడ్స్ ఏర్పాటు చేయడం దీని ప్రత్యేకత అని నిర్వాహకురాలు జి.రాజకుమారి తెలిపారు. లింగం పూర్ణచంద్రరావు–లక్ష్మీ సుందరి దంపతుల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు లింగం ప్రతాప్ వీటిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రెండు వేల కాపర్ పిరమిడ్‌లు ఈ బెడ్‌లపై ఏర్పాటు చేశామని వాటిపై కూర్చుని ధ్యానం చేసినా, పవళించినా పిరమిడ్ ప్రభావం శరీరంలోకి ప్రవేశించి శక్తిని నింపుతాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పిరమిడ్ ధ్యాన క్షేత్రం సభ్యులు పద్మ, వాణి, దేవి, లక్ష్మి, ప్రసన్న, నీలిమ, అనిత పాల్గొన్నారు.

ముగిసిన వికసిత భారత్‌సంకల్ప యాత్ర



పామర్రు: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన వికసిత సంకల్ప యాత్ర ముగిసిందని బీజేపీ నియోజకవర్గ కో–కన్వీనర్ కొల్లూరు రమేష్‌బాబు పేర్కొన్నారు. స్థానిక హితమ్ స్కూల్లో యాత్ర ముగింపు సందర్భంగా నియోజకవర్గ స్థాయి నాయకులతో కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో పేదరికం లేకుండా చేయాలన్నదే బీజేపీ ప్రధాన లక్ష్యమన్నారు. 2047 నాటికి దేశాన్ని సంపన్నం చేయాలనే ఉద్దేశంతో ప్రధాని నరేంద్రమోదీ పాలన సాగిస్తున్నారన్నారు. అనంతరం స్థానిక బీజేపీనాయకులు రమేష్‌బాబును సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు పొట్లూరి కృష్ణబాబు, యార్లగడ్డ రమేష్ బాబు, నరసరాజు, శ్రీకాంత్, హితమ్ స్కూల్ ప్రిన్సిపాల్ నందిపాటి హేమంత్‌రెడ్డి పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయండి



కైకలూరు: విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి అందరి మన్ననలు పొందాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా కైకలూరు రూరల్ ఎస్సైగా నియమితులైన తలారి రామకృష్ణ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను వారి నివాసగృహాల వద్ద ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. రూరల్ పరిధిలో పలు అంశాలపై చర్చించుకున్నారు.

చెరకు ట్రాక్టర్ బోల్తా



తోట్లవల్లూరు: చెరకు ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా కొట్టిన ఘటన మండలంలోని యాకమూరు సమీపంలో జరిగింది. తోట్లవల్లూరు నుంచి ఉయ్యూరు కేసీపీ చక్కెర కర్మాగారానికి చెరకులోడుతో వెళుతున్న ట్రాక్టర్ ఆదివారం ఉదయం కనకవల్లి డ్రెయిన్ సమీపంలో పంట బోదెలోకి పల్టీ కొట్టింది. ట్రాక్టర్ స్టీరింగ్‌లో సాంకేతిక లోపం కారణంగా ప్రమాదం జరిగినట్లు తెలిసింది.

మహిళల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

ఎంపీపీ అడవి కృష్ణ



సదస్సులో పాల్గొన్న ఎంపీపీ అడవి కృష్ణ తదితరులు

కైకలూరు: మహిళల హక్కుల రక్షణ అందరి బాధ్యతగా భావించాలని ఎంపీపీ అడవి కృష్ణ చెప్పారు. వరల్డ్ కౌన్సిల్ ఫర్ ఉమెన్ రైట్స్ (డబ్ల్యూసీడబ్ల్యూఆర్) ఏలూరు జిల్లా అధ్యక్షురాలు దోమతోటి సలోమి ఆధ్వర్యంలో ఆచవరం శివారు ఆనందరావుపేటలో మహిళల హక్కులపై అవగాహన సదస్సు ఆదివారం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మహిళాభివృద్ధికి అధిక ప్రాధాన్యం కల్పిస్తున్నారన్నారు. అందుకు నిదర్శనం కైకలూరులో 18 మంది మహిళా సర్పంచులు, నాలుగు మండలాల్లో జెడ్పీటీసీలుగా మహిళలు పదవులలో ఉండటమేనని తెలిపారు. దిశ యాప్‌ను ప్రవేశపెట్టి మహిళల రక్షణకు సీఎం పెద్ద పీట వేశారన్నారు. సంస్థ అధ్యక్షురాలు సలోమి మాట్లాడుతూ మహిళల హక్కుల కోసం ప్రపంచ మండలి అనే నినాదంతో డబ్ల్యూసీడబ్ల్యూఆర్ పనిచేస్తోందన్నారు. గ్రామాల్లో బాల్య వివాహాలను అందరూ నివారించాలన్నారు. బాలికలను ఎవరైనా లైంగికంగా వేధింపులకు గురుచేస్తే ధైర్యంగా పోలీసులకు చెప్పాలన్నారు. బాలబాలికలు విద్యతోనే ఏదైనా సాధించగలరన్నారు. విశ్రాంత ప్రొఫెసర్ సుధాబత్తుల విజయ్‌కుమార్ రాజ్యాంగం ద్వారా మహిళలకు లభించే హక్కులు, రక్షణలను వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్, సామాజిక సేవా కార్యకర్త కల్యాణి, మాజీ ఆచవరం సర్పంచ్ దండే సైమాన్‌రాజు, వైఎస్సార్ సీపీ నాయకుడు తోట మహేష్ పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్యశిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యబృందం

గుడివాడ టౌన్(నందివాడ): నందివాడ మండలం పుట్టగుంట గ్రామంలో పిన్నమనేని కోటేశ్వరరావు ఎడ్యుకేషన్ అండ్ మెడికల్ ట్రస్ట్ రుద్రపాక ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగానే ఈ వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రముఖులైన పిల్లల వైద్యులు, జనరల్ సర్జరీ, ఎముకల నిపుణులు, చెవి, గొంతు, ముక్కు నిపుణులు, స్త్రీల వైద్య నిపుణులు ఆధ్వర్యంలో వివిధ వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించామన్నారు. సుమారు 480 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. కంటి పరీక్షలలో కళ్లజోళ్లు అవసరమైన వారికి త్వరలోనే ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో గుడివాడ అర్బన్ బ్యాంక్ చైర్మన్ పిన్నమనేని పూర్ణవీరయ్య(బాబ్జి), ట్రస్ట్ సభ్యులు పిన్నమనేని వీరయ్య చౌదరి, పాలడుగు ధర్మపాల్, రాయుడు, వైద్యులు డాక్టర్ పీఆర్‌కే ప్రసాదు, డాక్టర్లు పి. మాధవి, పి.వంశీకృష్ణ, ఎల్.అమర్ చౌదరి, సురేష్‌బాబు, కె.శ్రావణి పాల్గొన్నారు.

ముగిసిన ఆడుదాం ఆంధ్రా పోటీలు



బ్యాడ్మింటన్ విజేతలతో నిర్వాహకులు

గుడివాడ టౌన్: ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలు శనివారం రాత్రి ముగిశాయి. వాలీబాల్, బ్యాడ్మింటన్ పురుషులు, మహిళా విభాగాలకు ఈ పోటీలు నిర్వహించారు. బ్యాడ్మింటన్ పురుషుల విభాగంలో గుడివాడ టీమ్ ప్రథమ స్థానం, గుడ్లవల్లేరు టీమ్ ద్వితీయ స్థానం, నందివాడ టీమ్ తృతీయ స్థానం సాధించారు. బ్యాడ్మింటన్ మహిళా విభాగంలో గుడివాడ మొదటి స్థానం, గుడ్లవల్లేరు రెండో స్థానం, నందివాడ మూడో స్థానం సాధించారు. వాలీబాల్ పురుషుల విభాగంలో గుడివాడ మొదటి స్థానం, గుడ్లవల్లేరు రెండో స్థానం, నందివాడ మూడో స్థానం సాధించగా మహిళల విభాగంలో గుడ్లవల్లేరు మండలం నుంచి ఒకే ఒక టీమ్ పోటీకు రాగా వారికి ప్రథమ బహుమతి కేటాయించారు.

ఉద్యోగ వయోపరిమితిని పెంచండి



ఎమ్మెల్సీ జయమంగళకు వినతిపత్రం అందజేస్తున్న సెర్ప్ సిబ్బంది

కైకలూరు: సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ(సెర్ప్)లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల వయోపరిమితిని మిగిలిన ఉద్యోగుల మాదిరిగా రెండేళ్లు వర్తింపజేయాలని సిబ్బంది ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణకు వినతిపత్రాలను వారి నివాసాల వద్ద ఆదివారం అందించారు. వారు మాట్లాడుతూ పదోన్నతులతో పాటు, జీతాభత్యాలు పెంచాలని కోరారు. కారుణ్య నియామకాలు చేపట్టాలన్నారు. దీనిపై ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ సమస్యలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళతానని చెప్పారు. ఏపీఎంలు టీవీ.సత్యనారాయణ, రవికుమార్, సీసీలు ఏ.సైదానీ, ఎన్.అమల, డి.మేరీరత్నబాయమ్మ, కె.పెద్దింట్లమ్మ పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం



వైఎస్సార్ సీపీ నాయకుడు బొడ్డు నోబుల్‌ను సన్మానిస్తున్న దళిత యువత

కైకలూరు: గౌతమ బుద్ధ ప్రచార వేదిక ఆధ్వర్యంలో ఇటీవల ఏలూరులో కైకలూరుకు చెందిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి బొడ్డు నోబుల్‌కు జై భీమ్ రత్న, దళిత నాయకుడు జక్కుల విజయ్‌కుమార్‌కు యువ రత్న అవార్డుల ప్రదానం చేశారు. దీంతో రాచపట్నానికి చెందిన అద్దంకి కృష్ణ, పళ్లెం కిషోర్ ఆధ్వర్యంలో కైకలూరులో నోబుల్ నివాసం వద్ద నోబుల్, విజయ్‌కుమార్‌ను ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ దళితులందరూ ఐక్యంగా హక్కుల సాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో భూపతి జాషువా, కొరపాటి ప్రవీణ్, అద్దంకి నాగేంద్రబాబు పాల్గొన్నారు.

మహాత్మాగాంధీ ఆశయాలకు స్ఫూర్తి.. సేవాశ్రమం

గత వైభవం తీసుకురావాలని ప్రజల ఆకాంక్ష



మండవల్లి శ్రీ గాంధీసేవాశ్రమం



ఆశ్రమ ప్రాంగణంలో గాంధీ మండపం

మండవల్లి: మండవల్లిలో స్వాతంత్ర సముపార్జనకు ముందుగా, మహాత్మాగాంధీ ఆశయాలకు స్ఫూర్తిగా గాంధీ సేవాశ్రమాన్ని స్థాపించారు. అప్పటి స్వాతంత్ర్య సమరయోధులు మానేపల్లి మల్లికార్జున గుప్తా, యెర్నేని సుబ్రహ్మణ్యం గ్రామస్తుల సహకారాలతో సేవాశ్రమాన్ని ప్రారంభించారు. వీరిరువురూ గాంధీజీ ద్వారా కొనసాగిన సబర్మతీ ఆశ్రమంలో కూడా కొంతకాలం గడిపారు. గాంధీజీ ఈ ఆశ్రమానికి గతంలో విచ్చేసినట్లు పెద్దలు చెబుతున్నారు. సుబ్రహ్మణ్యం మరణానంతరం మల్లికార్జునుడు తన యావచ్ఛక్తిని వినియోగించి ఆశ్రమాన్ని నడిపారు. ఎండోమెంట్స్ డిపార్టుమెంట్ దీని ఆజమాయిషీ పర్యవేక్షించే విధంగా ఆ శాఖకు అప్పగించారు. ఈయన మొదటి గాంధీ ఆశ్రమ అధ్యక్షుడు. అనంతరం మారగాని రామచంద్రరావు, గంగునేని వరప్రసాద్, బొమ్మనబోయిన గోకర్ణయాదవ్ అధ్యక్షులగా పనిచేశారు. ఈ ఆశ్రమంలో మల్లికార్జుని హయాంలో రాట్నంతో నూలు వడకుట, కూరగాయల పెంపకం తదితర కుటీర పరిశ్రమలు కొనసాగేవి. పేద వర్గాలకు ఎంతో ఆలంబనగా ఆశ్రమం నిలిచేది.

ఆశ్రమ భూముల లీజుతో కార్యక్రమాలు

ఆశ్రమానికి మూడున్నర ఎకరాల చేపల చెరువు, రెండు ఎకరాల వరిసాగు భూమి ఉంది. వీటిని లీజుకు ఇచ్చి వచ్చిన ఆదాయంతో ఆశ్రమంలో కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఎకరం ప్రదేశంలో గాంధీ ఆశ్రమ భవనం ఉంది. ఇందులో గాంధీజీ స్థూపం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం, అక్టోబర్ 2న గాంధీ జయంతి తదితర కార్యక్రమాలు ఇక్కడ నిర్వహిస్తారు. ఎండోమెంట్స్ ఈఓగా కె దివ్యశ్రీ విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఆశ్రమానికి పాలకవర్గం లేదు. గాంధీజీ ఆశ్రమానికి గత వైభవం తీసుకొచ్చేందుకు ఎండోమెంట్స్ శాఖ కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సుబ్బారాయుడిని దర్శించుకున్న భక్తులు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం – చేవూరుపాలెం సెంటర్లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో కొలువై ఉన్న స్వామిని అధికసంఖ్యలో భక్తులు ఆదివారం దర్శించుకున్నారు. స్వామివారి పుట్టలో పాలుపోసి దర్శించుకునేందుకు క్యూలో అధిక సమయం వేచి ఉండాల్సి వచ్చింది. పాలపొంగళ్లశాల వద్ద మహిళలు నైవేద్యాలు తయారుచేసి స్వామికి సమర్పించారు. నాగబంధాల వద్ద గోకులంలోని గోవులకు మహిళలు పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. సహాయ కమిషనర్ నేలసంధ్య భక్తులు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా పర్యవేక్షణ చేశారు.

గ్రామాభివృద్ధే లక్ష్యం



గుడ్లవల్లేరు: గ్రామాభివృద్ధే లక్ష్యంగా అంగలూరు గ్రామ కమిటీ కృషి చేస్తోందని సర్పంచ్ మేడేపల్లి రవికుమార్ అన్నారు. గ్రామంలో ఆదివారం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో కూలింగ్ వాటర్ ప్లాంట్‌ను సర్పంచ్ ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ దుగ్గిరాల శేషుబాబు, తిపిర్నేని రాజా, రాజేంద్ర ప్రసాద్, గురుప్రసాద్, మాధవ్ పాల్గొన్నారు.

మూలలంక వైద్యాధికారిగా నస్రీన్



కలిదిండి: మూలలంక పీహెచ్‌సీ వైద్యాధికారిగా షేక్ నస్రీన్ ఆదివారం నియమితులయ్యారు. బంటుమిల్లి గ్రామానికి చెందిన నస్రీన్ శ్రీకాకుళం రిమ్స్ గవర్నమెంట్ కాలేజ్‌లో ఎంబీబీఎస్ కోర్సు పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రభుత్వం కల్పించిన వైద్య సౌకర్యాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆమె ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), మండల స్థాయి ప్రజాప్రతినిధులను మర్యాదపూర్వకంగా కలిశారు.

అన్నసమారాధన



పెనమలూరు: పెనమలూరు గ్రామంలో ఆదివారం అయ్యప్పస్వామి అన్న సమారాధన పెద్ద ఎత్తున నిర్వహించారు. గ్రామంలో గత 44 సంవత్సరాలుగా భక్తులు, గ్రామస్తులు, దాతల సహకారంతో అయ్యప్పస్వామి అన్నసమారాధన చేస్తున్నారు. గృహనిర్మాణ శాఖమంత్రి, పెనమలూరు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త జోగి రమేష్ అయ్యప్పస్వామి అన్నసమారాధన కార్యక్రమంలో ప్రత్యేక పూజలు చేశారు. పూజారులు మంత్రితో పూజలు చేయించారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీబీ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి, గ్రామ సర్పంచి లింగాల భాస్కరరావు, పలువురు వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన అన్నమారాధన కార్యక్రమంలో 25 వేల మందికి పైగా భక్తులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల రద్దీతో పెనమలూరు గ్రామం కిటకిటలాడింది.

వైస్ ఎంపీపీ ఆదివిష్ణుకు మాతృవియోగం



అనసూయమ్మ (ఫైల్)

మండవల్లి: వైస్ ఎంపీపీ అగస్తి ఆదివిష్ణుకి మాతృవియోగం కలిగింది. ఆయన తల్లి అనసూయమ్మ ఆదివారం ఆమె స్వగ్రామం మూలపేటలో అనారోగ్యంతో మృతి చెందారు. ఆమెకు ముగ్గురు కుమారులు. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్(రాము), ఎమ్మెల్యే తనయులు దూలం ఆదివినయ్‌కుమార్, దూలం ఫణిశ్యాంకుమార్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బేతపూడి యేసోబురాజు అనసూయమ్మ భౌతికకాయానికి నివాళులర్పించారు.

మద్యం బాటిళ్ల పట్టివేత

తోట్లవల్లూరు: అక్రమంగా మద్యం అమ్మకాలు జరుపుతున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటన మండలంలోని గురివిందపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన చక్కా జగన్మోహన్‌రావు తన బడ్డీ షాపులో మద్యం అమ్మకాలు జరుపుతుండగా ఎస్‌ఐ పి. విశ్వనాథ్ ఆదివారం దాడి జరిపి పట్టుకున్నారు. ఈ దాడిలో 15 మద్యం క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న మానవత సంస్థ జిల్లా కార్యదర్శి శీతాల ప్రసాద్

పామర్రు: వ్యక్తిత్వ వికాస నిపుణులతో విద్యార్థులకు చదువుపై శ్రద్ధ, నైతిక విలువలుపై నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని మానవత కృష్ణాజిల్లా కార్యదర్శి శీతాలప్రసాద్ పేర్కొన్నారు. మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం సర్వ సభ్య సమావేశం, సభ్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల అభ్యున్నతికి మానవత సేవ సంస్థ కృషి చేస్తోందన్నారు. ఇందులో భాగంగా ప్రతి ప్రభుత్వ విద్యాలయంలో కెరియర్ గైడెన్స్ శిక్షణ తరగతులను చేపట్టినట్లు తెలిపారు. విద్యార్థుల్లో నైతిక విలువలను పెంపొందించేందుకు ఈశిక్షణ తరగతులు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. ఫిబ్రవరిలో జరిగే పామర్రు శ్రీగంగానమ్మ జాతరకు వచ్చే భక్తులకు వాటర్ ప్యాకెట్లు సరఫరా చేయాలని సమావేశంలో తీర్మానించామన్నారు. వారణాసి హిందూ శ్మశాన వాటికలో పాడైపోయిన నీళ్ల బోర్ స్థానంలో దాతల సహకారంతో నూతన బోర్ వేయించాలని తీర్మానించామన్నారు. కార్యక్రమంలో పామర్రు మానవత సేవా సంస్థ అధ్యక్షుడు ఐవీఎస్ మనోహరరావు, రీజియన్ చైర్మన్ పీఎంఎస్‌ప్రసాద్, కార్యదర్శి పామర్తి వెంకట నారాయణ, కన్వీనర్ నూతలపాటి త్రివిక్రమరావు, ప్రతినిధులు అల్లాడ సోమశేఖర్, తాడిశెట్టిసాయిబాబు, మండపాక సుబ్బారావు, విజయలక్ష్మి పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు



సీఐ దుర్గారావును సత్కరిస్తున్న పుట్టి హరికుమార్‌యాదవ్

గుడివాడరూరల్: శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటానని టూటౌన్ సీఐ నాగదుర్గారావు పేర్కొన్నారు. టూటౌన్ సీఐగా బాధ్యతలు చేపట్టిన దుర్గారావును శ్రీకృష్ణయాదవ సేవా సంఘం సభ్యులు, మిత్రమండలి సభ్యులు ఆదివారం సత్కరించి సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపతామన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కడైనా పేకాట, కోడిపందాలు, ఇతర జూదాలు నిర్వహిస్తే వెంటనే స్థానికులు సమాచారం ఇవ్వాలని సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని సీఐ స్పష్టం చేశారు. గంజాయి విక్రయాలపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో శ్రీకృష్ణయాదవ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుట్టి హరికుమార్‌యాదవ్, వైశ్యసంఘ ప్రముఖుడు బొగ్గరపు తిరుపతయ్య, నవభారత్ ఖాదీస్టోర్స్ అధినేత సయ్యద్ గఫార్, యాదవసంఘ నేతలు కుంభం నాగమణి, తలకొండ సత్యనారాయణ, జాజుల తాతారావు, మాకుల సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉత్కంఠభరితంగా సాగిన టీచర్స్ సొసైటీ ఎన్నికలు



డైరెక్టర్లుగా ఎంపికైన అభ్యర్థులు

మొవ్వ: మొవ్వ పంచాయతీ సమితి ఉపాధ్యాయ సహకార ప్రగతి సంఘం ఎన్నికలను ఆదివారం స్థానిక సొసైటీ కార్యాలయంలో ఉత్కంఠభరితంగా సాగాయి. సొసైటీ పరిధిలోని మొవ్వ, ఘంటసాల, చల్లపల్లి మండలాలలోని 126 మంది ఉపాధ్యాయలకు 123 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఎన్నికలకు పోలింగ్ అధికారిగా కేఎస్ఆర్ కే మూర్తి వ్యవహరించారు. అనంతరం జరిగిన ఓట్ల లెక్కింపు ఉత్కంఠ భరితంగా సాగింది. ఏడుగురు డైరెక్టర్లలో నలుగురు ఏపీటీఎఫ్ సభ్యులుగా, ముగ్గురు యూటీఎఫ్ సభ్యులు విజేతలుగా నిలిచారు. గరికపాటి వెంకటేశ్వరరావు, పాగోలు దుర్గాప్రసాద్, రాజులపాటి శ్రీనివాసరావు, మత్తి రత్నగిరి రావు, ఓలేటి రమేష్, బత్తుల కిషోర్ బాబు , మహమ్మద్ ఇంతియాజ్ విజయం సాధించారు. కాగా అధ్యక్ష కార్యదర్శులుగా మహమ్మద్ ఇంతియాజ్, గరికపాటి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడి పాగోలు దుర్గాప్రసాద్, కోశాధికారిగా బత్తుల కిషోర్ బాబులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

కొండలమ్మకు మొక్కుల చెల్లింపు



గుడ్లవల్లేరు: వేమవరం కొండలమ్మ అమ్మవారికి మొక్కులను చెల్లించుకునేందుకు భక్తులు అధికసంఖ్యలో ఆదివారం క్యూలలో బారులు తీరారు. అమ్మవారికి మహిళా భక్తులు పాల పొంగళ్లను సమర్పించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈఓ సురేష్, చైర్మన్ శేషం గోపి తగు ఏర్పాట్లు చేశారు.

ఉపాధి హామీ పథకంపై అవగాహన



గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ ఆనంద్‌కుమార్

కలిదిండి: గ్రామీణ ప్రాంతాల్లో వలసలను అరికట్టి, ప్రజలకు పని కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తోందని డీఆర్పీ బొమ్మప్ప తెలిపారు. పోతుమర్రు, భాస్కరరావుపేట, కోరుకొల్లు గ్రామాల్లో సర్పంచ్‌ల ఆధ్వర్యంలో ఆదివారం గ్రామసభ నిర్వహించారు. ఉపాధిహామీ పథకంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. పంచాయతీలో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు గొర్ల వరలక్ష్మి, గద్దె ఆనంద్‌కుమార్, బట్టు లీల కనకదుర్గ, డీఆర్పీలు పి.మల్లికార్జున్‌రెడ్డి, పవన్, పంచాయతీ కార్యదర్శి ఉదయ భాస్కర్ పాల్గొన్నారు.

కార్తికేయుని సన్నిధిలో భక్తుల రద్దీ

మోపిదేవి: ప్రసిద్ధపుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న మోపిదేవి వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారిని ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. ఆదివారం కావడంతో తెల్లవారు జాము నుంచే పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ప్రధాన క్యూలైన్లతో పాటు ఆలయ ప్రాంగణం భక్తజనంతో నిండిపోయింది. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగళ్లశాల వద్ద భక్తుల రద్దీ ఏర్పడింది. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

విస్తృతంగా ఆర్టీసీ సేవలు

కృత్తివెన్ను: తీరప్రాంతాలైన మచిలీపట్నం, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాలకు ఆర్టీసీ సేవలను మరింత విస్తృతంగా అందిస్తున్నట్లు ఆర్టీసీ కృష్ణా జోనల్ చైర్మన్ పిన్నెంటి మహేష్ అన్నారు. దీనిపై ఆయన ఆదివారం మాట్లాడారు. విజయవాడ నుంచి కాకినాడ, కాకినాడ నుంచి విజయవాడకు కృత్తివెన్ను మీదుగా వెళ్లే అల్ట్రా డీలక్స్ బస్సుకు ప్రయాణికులు విన్నపం మేరకు ఇప్పుడు కృత్తివెన్నులో స్టాపు కేటాయించినట్లు వివరించారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వాడపల్లికి మచిలీపట్నం నుంచి బస్సు సర్వీసు ఉందని, రాకపోకలకు (అప్ అండ్ డౌన్)కు సంబంధించి ముందుగానే టికెట్‌ను 35071కు కాల్ చేసి రిజర్వేషన్ చేసుకోవచ్చన్నారు. బంటుమిల్లి, కృత్తివెన్ను, పల్లెపాలెంలలో స్టాపులు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.